సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం । 7 । ఆగస్టు । 2024



రారండోయ్.. జాతర చూద్దాం

నందలూరు మండల కేంద్రంలోని అరవపల్లిలోని ముత్తు మారెమ్మ ఆలయంలో ఈనెల 10 నుంచి జాతర నిర్వహించనున్నారు. భక్తులు భారీగా తరలి రానున్నారు. - 8లో



ఆధిక్యంలో కడప జట్టు

ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-19 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో కడప జట్టు స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతోంది. జట్టులోని మన్విత్‌రెడ్డి 175 బంతుల్లో 134 పరుగులు చేశాడు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.290	రూ.340
రెండోరకం	రూ.200	రూ.268



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 591 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	460	460
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 261.580 కిలోలు

చిరుద్యోగులపై కొరడా!

అధికారంలోకి వచ్చింది మొదలు టీడీపీ నేతలు కక్ష సాధింపు చర్యలకు తెర లేపారు. వారూ వీరు అని తేడా లేకుండా చివరకు చిరుద్యోగులను సైతం వదల్లేదు. ఫలితంగా వీరి ఒత్తిడి.. వేధింపులు భరించలేక కొందరు ఆత్మహత్యా యత్నాలకు పాల్పడుతున్నారు. అధికార పార్టీ నేతల వైఖరిలో మార్పు రాకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని పలు కార్మిక, ఉద్యోగ సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు.

- అధికారుల మెడపై కత్తిపెట్టి తొలగింపునకు శ్రీకారం
- పీలేరులో అధికార పార్టీ ఒత్తిళ్లతో కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు
- వారంతట వారే తప్పుకునేలా కూటమి నేతల తీవ్ర ఒత్తిడి
- లక్కిరెడ్డిపల్లె, రామాపురం, గాలివీడు మండలాల్లో పలువురు డీలర్ల తొలగింపు
- అంగన్వాడీ వర్కర్లపై తీవ్ర స్థాయిలో వేధింపులు
- కూటమి నేతల తీరుపై సర్వత్రా విమర్శలు



చిరుద్యోగులపై కూటమి నేతల వేధింపులు ఆపాలని సోమవారం కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మహిళల ధర్నా(ఫైల్)

సాక్షి రాయచోటి: అధికారంలోకి రాగానే మళ్లీ పాత రోజులను గుర్తుకు తెచ్చేలా కూటమి నేతల వ్యవహారశైలి కనిపిస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో భారీ విజయం లభించగానే అడిగేవారు లేరనో.. అధికారం తమదేనన్న ధీమానో తెలియదుగానీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. ఒకవైపు టీడీపీ శ్రేణులు దాడులకు తెగబడుతూ భయోత్పాతాన్ని సృష్టిస్తుండగా, మరోవైపు వైఎస్సార్‌సీపీ నేతలపై కక్షగట్టి భయాందోళనలకు గురి చేస్తున్నారు. దీనికితోడు చిరుద్యోగులపై వేధింపులకు దిగుతుండడం ఆందోళనకర పరిణామం. చివరకు వారిని కూడా వదలకుండా తొలగించే కార్యక్రమానికి తెర లేపారు. ప్రధానంగా ఐదు శాఖల్లోని పలు విభాగాల చిరుద్యోగులపై దండయాత్ర మొదలు పెట్టారు.

వారంతట వారే రాజీనామాలు చేసేలా ఒత్తిళ్లు..

అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచి చిరుద్యోగులను తొలగించడమే లక్ష్యంగా అధికారుల మెడపై కత్తి పెడుతున్నారు. అందులోనూ టీడీపీ కొత్త పంథాకు తెర తీసింది. వారి ద్వారా తీసేసినట్లు కాకుండా ఒత్తిడి చేయడం ద్వారా వారంతట వారే తప్పుకునేలా అధికారుల ద్వారా ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఇప్పటికే మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె, రాయచోటి, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో కూటమి నేతలు తొలగింపు ప్రక్రియ చేపట్టారు. కూటమి నేతల వేధింపులను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో చిరుద్యోగులకు మద్దతుగా పెద్ద ఎత్తున అన్నమయ్య కలెక్టరేట్ ఎదుట ఆందోళన కూడా చేపట్టారు.

పీలేరులో ఫీల్డ్ అసిస్టెంట్లు.. రాయచోటి పరిధిలో డీలర్లు

అన్నమయ్య జిల్లాలో అధికార పార్టీ నాయకులు ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఒక్క పీలేరు పరిధిలోనే 11 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను స్వచ్ఛందంగా తప్పుకునేలా ఒత్తిళ్లు తీసుకొచ్చారు. దీంతో ఇటీవలే వారిలో కొంతమంది తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. రాయచోటి పరిధిలోని రామాపురంలో ఇద్దరు డీలర్లు, లక్కిరెడ్డిపల్లెలో ఒకరిని తప్పించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా మధ్యాహ్న భోజన కార్మికులతోపాటు ఆశా వర్కర్లపై కూడా తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లకు పాల్పడుతున్నారు.

రాజకీయ కక్షతో సంఘమిత్రను తొలగించే యత్నం

నిమ్మనపల్లె: రాజకీయ ప్రయోజనాల కోసం ప్రస్తుతం పని చేస్తున్న ఓ సంఘమిత్రను ఎలాంటి ఆరోపణలు లేకుండానే తొలగించే ప్రయత్నం చేస్తున్న ఏపీఎం వైఖరిపై గ్రామ సమాఖ్య (వీఓ)సభ్యులు నిమ్మనపల్లె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు.. ఈనెల 5వ తేదీ సోమవారం ఏపీఎం రజని అగ్రహారం గ్రామానికి వచ్చి గ్రామస్తుల సమక్షంలో కారణం తెలియజేయకుండా గ్రామ సమాఖ్య సభ్యులచే మినిట్స్ బుక్‌లో సంతకాలు చేయించుకున్నారన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న సంఘమిత్ర మాధవి స్థానంలో విజయలక్ష్మిని నియమిస్తున్నట్లు తెలిపారన్నారు. దీనిపై గ్రామస్తులు, సంఘం సభ్యులు, సర్పంచ్ ఉషారాణి ప్రశ్నించగా తనపై రాజకీయ ఒత్తిడి ఉందని సమాధానం ఇచ్చారన్నారు. ఆమె వైఖరిపై జిల్లా ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు. కాగా ఈ విషయమై ఏపీఎం రజని వివరణ కోరగా ప్రస్తుతం తాను ఈ విషయంపై స్పందించలేనని, తాను కూడా వారిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నానని చెప్పారు.

మహిళలకు తప్పని వేధింపులు

జిల్లాలో అంగన్వాడీ వర్కర్లతోపాటు పొదుపు సంఘాల్లో పనిచేసే యానిమేటర్లపై కూడా వేధింపులు కొనసాగుతున్నాయి. అంగన్వాడీ వర్కర్లు తప్పుకోవాలని కూటమి శ్రేణులు హెచ్చరిస్తున్నాయి. చేసేదేమీ లేక సంబేపల్లె మండలంలోని పెద్దజంగంపల్లెకు చెందిన జె.నాగరత్న అనే అంగన్వాడీ వర్కర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. అలాగే రాయచోటి గురుకుల పాఠశాలలో పనిచేసే మరో కాంట్రాక్టు ఉద్యోగి సైతం అధికార పార్టీ నేతల వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నం చేశారు. అంతేకాకుండా చిన్నమండెం, సంబేపల్లె మండలాల్లోని పలువురు డ్వాక్రా యానిమేటర్లు తప్పుకోవాలని తెలుగుదేశం పార్టీ నేతలు హుకుం జారీ చేస్తున్నారు. మదనపల్లె నియోజకవర్గ పరిధిలోని నిమ్మనపల్లె మండలం అగ్రహారానికి చెందిన సంఘమిత్ర గ్రూపునకు సంబంధించి యానిమేటర్‌ను తప్పించేందుకు అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో యానిమేటర్‌ను తొలగించాలని చేస్తున్న వేధింపుల పర్వంపై గ్రూపునకు సంబంధించిన సభ్యులు ఏకంగా నిమ్మనపల్లె పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వేధింపులు ఇలాగే కొనసాగితే ప్రతిఘటన తప్పదని పలు ఉద్యోగ, కార్మిక సంఘాలు హెచ్చరిస్తున్నాయి.



సంబేపల్లె మండలంలో ఆత్మహత్యకు యత్నించిన అంగన్‌వాడీ వర్కర్ (ఫైల్)

ఇది సరైన పద్ధతి కాదు



ప్రభుత్వాలు మారినప్పుడల్లా అంగన్వాడీలు, ఆయాలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, డీలర్లు, కాంట్రాక్ట్ ఉద్యోగులపైన రాజకీయాలు రుద్దడం సహేతుకం కాదు. ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ ఉద్యోగాలు చేస్తున్న చిన్న ఉద్యోగస్తులను తమ పార్టీకి ఓట్లు వేయలేదని కక్ష సాధించడం సరైన పద్ధతి కాదు.

–శెట్టిపల్లి సాయికుమార్, హ్యూమన్ రైట్స్ స్టూడెంట్ సెల్, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు

రాజకీయ కక్షలు మానుకోవాలి



అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం అభివృద్ధి పైన దృష్టి పెట్టాలి తప్ప చిన్న చిన్న ఉద్యోగులపై కక్ష సాధింపు ధోరణి మంచిది కాదు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా వేతన కార్మికులను తొలగించి వారి స్థానంలో అనుకూలమైన వారిని నియమించుకోవాలన్న ఆలోచనను విరమించుకోవాలి. చిరుద్యోగులను తొలగిస్తే ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుంది. –రామాంజులు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి.

విధి నిర్వహణలో అప్రమత్తత అవసరం

సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్

కురబలకోట: సిబ్బంది విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి కురబలకోట రెవెన్యూ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఇన్‌చార్జి తహసీల్దార్ నవీన్, ఆర్‌ఐ సుగుణ, వీఆర్వోలకు వివిధ అంశాలపై సూచనలు చేశారు. వారితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇదివరలో మండలంలో జరిగిన ఎన్‌ఓసీలు, డీకేటీ భూముల బదలాయింపు, అసైన్‌మెంట్ భూములకు యాజమాన్య హక్కుల కల్పన, అనుభవంలో ఉన్న ఇంటి పట్టాల గురించి అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకు ముందు ఆయన ముదివేడు సమీపంలోని కేజీబీవీ స్కూల్‌ను సందర్శించారు. ఇటీవల ముగ్గురు విద్యార్థినుల ఆత్మహత్యాయత్నంపై సమగ్ర విచారణ జరిపారు. సస్పెన్షన్‌కు గురైన వారితోపాటు బాధిత విద్యార్థులు, తల్లిదండ్రులతో విడివిడిగా మాట్లాడారు.



కురబలకోట రెవెన్యూ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్

11 వరకు తిరుమల ఎక్స్‌ప్రెస్ రద్దు



కడప కోటిరెడ్డిసర్కిల్: విజయవాడ రైల్వేస్టేషన్ సమీపంలోని నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా కడప–విశాఖపట్టణం మధ్య నడుస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలును ఈనెల 11వ తేది వరకు రద్దు చేసినట్లు కడప రైల్వే చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ మోహన్‌దాస్ తెలిపారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

ఎస్‌పీఏతో వైఎస్‌ఆర్ ఏఎఫ్‌ఏయూ ఎంఓయూ

ఏఎఫ్‌యూ: విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ (ఎస్‌పీఏ)తో కడప వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. మంగళవారం విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ డైరెక్టర్ ఆచార్య కొండా రమేష్ ఆధ్వర్యంలో ఏఎఫ్‌యూ వైస్ చాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథ కుమార్ ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అకడమిక్ అంశాలతో పాటు పరిశోధనకు సంబంధించిన కార్యకలాపాల్లో రెండు సంస్థలు కలిసి పనిచేస్తాయన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విద్యార్థులకు మెటీరియల్, వెబినార్లు, ఉపన్యాసాలు, విద్యార్థుల జ్ఞాన మార్పిడి, నైపుణ్య సంబంధిత అంశాలపై ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. డా॰కాజా నాగరాజు ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్కిటెక్చర్ డా. కాజా నాగరాజు, డీన్ డా. జనమేజోయ్ గుప్తా, అమిత్ సర్కార్, ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.



ఎస్‌పీఏ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంటున్న ఏఎఫ్‌యూ వీసీ తదితరులు

చీరకాలం గుర్తుండిపోయేలా.!

- మధ్యతరగతి వర్గాలను ఆ'కట్టుకునే' నీరుగట్టువారిపల్లె 'బుట్టా' చీరలు
- నేతన్న నేస్తంతో మారిన జీవనశైలి
- వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్షన్ కింద అవార్డుకు ఎంపిక
- నేడు జాతీయ చేనేత దినోత్సవం

మదనపల్లె సిటీ: పట్టుచీరలు అనగానే ప్రతి ఒక్కరికీ టక్కున గుర్తొచ్చే పేరు కంచి, ధర్మవరం, గద్వాల, మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి.. ఈ ప్రాంతాల్లో తయారయ్యే చీరలకు ఒకో రకమైన విశిష్టత ఉంటుంది. మదనపల్లె నీరుగట్టువారిపల్లెలో తయారయ్యే 'బుట్టా' రకం చీరలకు ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఇతర ప్రాంతాల్లో సంపన్న వర్గాలను దృష్టిలో ఉంచుకుని చీరలను తయారుచేస్తే, కేవలం మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకుని ఇక్కడ చీరల తయారీ జరుగుతుంది. రూ. 2,000 నుంచి రూ.లక్ష రూపాయల వరకు ఇక్కడ చీరలు దొరకుతాయి. వీటిలో నీరుగట్టువారిపల్లె ప్రత్యేకతగా పేరుమోసిన బుట్టా చీరలు రూ.7,000 నుంచి రూ.9,500 వరకు లభ్యమవుతాయి. నీరుగట్టువారిపల్లెలో సుమారు 15,000 మగ్గాలున్నాయి. వీటిని నమ్ముకుని ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 20,000 మంది వరకు కార్మికులు జీవనోపాధి పొందుతున్నారు. డైయింగ్, ట్విస్టింగ్, అచ్చు అతకడం, జరీపోత, రోలింగ్ తదితర అనుబంధ పరిశ్రమలు ఇక్కడే ఉండటం మూలాన పూర్తిస్థాయిలో చీర తయారీ ఇక్కడే జరుగుతోంది. ఇక్కడ తయారైన చీరలు దక్షిణాది రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాలకు, ఢిల్లీ, ముంబయి, కలకత్తా, విదేశాలకు సైతం ఎగుమతులు జరుగుతున్నాయి. మగ్గం మీద ఒక కార్మికుడు రోజుకు 10 గంటలు శ్రమిస్తే మూడు రోజులకు ఒక చీర తయారీ జరుగుతుంది. ఈ లెక్కన మదనపల్లెలో ఒక మగ్గం మీద నెలకు సరాసరి 7 చీరల ఉత్పత్తి జరిగినా నెలకు సుమారు 1,05,000 చీరలు ఉత్పత్తి అవుతున్నాయి. ఏడాదికి వీటి మీద సుమారు రూ.100 కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయంటే అతిశయోక్తి కాదు.



మగ్గం మీద చీర నేస్తున్న నేత కార్మికురాలు

బుట్టా' చీరల ప్రత్యేకత: పూర్తిగా మగ్గం మీద నేయడం, రెండు వార్పులు, నాలుగు పోగులతో నేస్తూ, హ్యాండ్ ట్విస్టింగ్‌తో బరువు 700 నుంచి 750 గ్రాముల వరకు ఉంటుంది. చూడగానే ఆకట్టుకునేలా మంచి డిజైన్లతో ఆకర్షణీయంగా ఉంటుంది.

వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ అవార్డు..

కేంద్ర ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ పథకం కింద మదనపల్లె (నీరుగట్టువారిపల్లె) ఈ ఏడాది ఎంపికైంది. దేశ వ్యాప్తంగా ఒక్కో జిల్లా నుంచి ఒక ఉత్పత్తి విశిష్టతను తెలియజేసేందుకు ఓడీఓపీ అవార్డుకు నీరుగట్టువారిపల్లె పట్టుచీరలు ఎంపికయ్యాయి.



నీరుగట్టువారిపల్లె 'బుట్టా' చీర

అమ్మకాల్లో కొత్త పుంతలు



స్థానిక వ్యాపారులు ఆన్‌లైన్ వేదికగా సామాజిక మాధ్యమాల సహాయంతో అమ్మకాలు మొదలు పెట్టారు. అతివల చెంతకే అగ్గువగా కోరుకున్న పట్టుచీరలను చేరుస్తూ ఉపాధి పొందుతున్నారు. వాట్సప్, ఫేస్‌బుక్ గ్రూపుల్లో ఫొటోలు ఉంచడమే కాకుండా వినియోగదారులు నచ్చిన చీరలను ఇంటికి పంపించి డబ్బులు ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా అందుకుంటున్నారు. ఇప్పుడిప్పుడే ఆన్‌లైన్ వ్యాపారాలు పుంజుకుంటుండంతో కార్మికులకు పని దొరుకుతోంది.

– దండు రామాంజులు, పట్టుచీరల వ్యాపారి, మదనపల్లె.

నేతన్న నేస్తంతో జీవితాల్లో వెలుగులు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నేతన్నలకు అందిస్తున్న ప్రోత్సాహకాలతో జీవనశైలిలో మార్పు వచ్చింది. నేతన్న నేస్తంతో చేనేత కార్మికులు సొంతంగా మగ్గాలను ఏర్పాటు చేసుకున్నారు. పనిభారం తగ్గించుకునేందుకు ఆధునిక జాకార్డ్ యంత్రాల కొనుగోలు, డిజైన్ కార్డులు, వార్పుల కొనుగోలుతో నాణ్యమైన చీరల ఉత్పత్తితో అధిక ఆదాయాన్ని పొందుతున్నాం. గతంతో పోలిస్తే రెండేళ్లలో మా బతుకుల్లో గణనీయమైన మార్పులు వచ్చాయి. – సుధాకర్, చేనేత కార్మికుడు, నీరుగట్టువారిపల్లె

నేడు జాతీయ చేనేత దినోత్సవం ర్యాలీ

రాయచోటి: ఈనెల 7వ తేదీ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా చేనేత, వస్త్ర శాఖ అధికారి శ్రీదేవి తెలిపారు. ఈ ర్యాలీని బుధవారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ ఆవరణంలో ఉన్న జిల్లా చేనేత, వస్త్రశాఖ అధికారి కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ జెండా ఊపి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ సిబ్బంది, 200 మందికి పైగా చేనేత కార్మికులు పాల్గొంటారన్నారు.

నేడు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడి రాక

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు జంగం రాజేంద్రప్రసాద్ బుధవారం కడపకు రానున్నట్లు కలెక్టర్ శివశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా కలెక్టర్, ఎస్పీలతో సమావేశమై పలు అంశాలపై చర్చించనున్నారు. అలాగే హాస్టళ్ల సంక్షేమ అధికారులు, గురుకుల ప్రిన్సిపాళ్లు, కేజీబీవీ, మోడల్ స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, ఐసీడీఎస్ అధికారులతో సమావేశం కానున్నారు. అదేవిధంగా ఓ సంక్షేమ హాస్టల్‌ను తనిఖీ చేసి రాత్రి అక్కడే బస చేయనున్నారని వివరించారు.

దళిత కమిషనర్‌పై టీడీపీ మూకల దౌర్జన్యం దారుణం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

రాజంపేట రూరల్: దళితుడైన మున్సిపల్ కమిషనర్ రాంబాబుపై టీడీపీ రౌడీ మూకలు దౌర్జన్యానికి పాల్పడటం నీచమైన చర్య అని దళిత సంఘాల ప్రతినిధులు మండిపడ్డారు. స్థానిక ఆర్‌అండ్‌బీ ఎదుట ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం దళిత సంఘాల (మాల మహానాడు, ఏపీ ఎమ్మార్పీఎస్) నాయకులు నల్ల రిబ్బన్లతో నిరసన తెలిపారు. అనంతరం పట్టణ సీఐ మద్దెయ్య ఆచారికి కమిషనర్‌పై దౌర్జన్యానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఫిర్యాదు చేశారు. అలాగే సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న ఒక దళిత అధికారిపై టీడీపీ రౌడీమూకలు సోమవారం తన చాంబర్‌కు వెళ్లి దౌర్జన్యం చేసి బెదిరించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో జోరోపల్లి భాస్కర్, దండుగోపీ, సత్యాల రామకృష్ణ, దాసరి పెంచలయ్య, రంగాల కమలాకర్, శేఖర్‌బాబు, నరసింహులు, గొంటు మణి, ఎస్.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వే పక్కాగా నిర్వహించాలి

రామాపురం: ఈనెల 15 నుంచి నిర్వహించే క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వేలో ఆరోగ్య సిబ్బంది పాల్గొని పక్కాగా నిర్వహించాలని డీఈఎంఓ దేవశిరోమణి, మండల వైద్యాధికారి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆశా వర్కర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రస్తుత సీజన్‌లో వర్షాలు కురవడం వల్ల గుంతలలో మురికినీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెంది విష జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పశుసంపద వివరాలు తెలపండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఏహెచ్‌ఓ డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై

రాజంపేట రూరల్: గ్రామ స్థాయిలోని పాడి రైతులు తమ ఇంటి వద్దకు వచ్చే పశుసంవర్ధకశాఖ సిబ్బందికి పశు సంపద వివరాలు తెలపాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి(డీఏహెచ్‌ఓ) డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై కోరారు. స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో మంగళవారం డివిజన్ స్థాయిలోని ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లతో రాజంపేట డీడీ డాక్టర్ వై.విజయబాస్కర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఈనెల 1న ప్రారంభమైన పశుగణన సర్వే డిసెంబరు 31వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఈ సమావేశంలో రాజంపేట డీడీ వై.విజయభాస్కర్‌రావు, శిక్షకులు డాక్టర్ లోకేష్, ఏడీ డాక్టర్ కె. ప్రతాప్, డాక్టర్ ఎస్.సురేష్‌రాజుతో పాటు డివిజన్‌లోని రాజంపేట, రైల్వేకోడూరు, నందలూరు, చిట్వేలి, పెనగలూరు, ఓబులవారిపల్లి మండలంలోని పశు వైద్యులు, పారా సిబ్బంది, ఏహెచ్‌ఏలు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల ప్రక్రియ వేగవంతం చేయండి



ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి, తదితరులు

రాయచోటి టౌన్: ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం రాయచోటి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అన్నమయ్యజిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఏళ్ల పైబడిన వారు, చదువు మధ్యలో మానేసిన వారు ఓపెన్ స్కూల్లో చేరేందుకు అర్హులన్నారు. రాష్ట్ర పరిశీలకుడు అక్బర్ అలీ మాట్లాడుతూ సెలవు రోజుల్లో తరగతులు ఉంటాయని, సరళమైన భాషలో విద్యాబోధన జరుగుతుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగులు, మాజీ సైనికోద్యోగులకు అడ్మిషన్ ఫీజులో రాయితీ ఉంటుందన్నారు. జిల్లా ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాస రాజు మాట్లాడుతూ అడ్మిషన్ పొందిన తరువాత ఐదేళ్లలోపు తొమ్మిది సార్లు పరీక్షలకు హాజరయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పదోన్నతులు కల్పించాలి



ఆర్డీ డాక్టర్ శ్రీనివాసులుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎన్జీఓ నేతలు

కడప రూరల్: అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.శ్రీనివాసులు, బి.రవికుమార్ కోరారు. వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్‌గా డాక్టర్ శ్రీనివాసులు ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మంగళవారం స్థానిక కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ జోన్-4 పరిధిలో అన్ని క్యాడర్లకు సంబంధించిన అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో శ్రీను, బాల పుల్లయ్య, కడప అధ్యక్షులు చిన్నయ్య, కార్యదర్శి శైలేశ్వర్‌రెడ్డి, పద్మనాభం, జ్యోతి, గౌరి, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులోని యూనిట్-2 పరిధిలో కోల్ మిల్స్ వద్ద పైపులైన్ లీకేజీ అయి నీరు ప్రవహిస్తోంది. ఆ నీళ్లు అక్కడ పేరుకుని పోయిన బూడిదతో కలవడంతో ప్రమాదం పొంచి ఉందని స్థానిక ఉద్యోగులు, కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15 రోజులుగా నిల్వ ఉన్న ఈ బూడిద నీళ్లను తొలగించే చర్యలను అధికారులు చేపట్టడం లేదని వారు వాపోతున్నారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు, కార్మికులు జారి పడే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ఆర్టీపీపీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - ఎర్రగుంట్ల

నేల పాలైన బియ్యం



రైలు వ్యాగిన్ ద్వారా మంగళవారం కడప రైల్వేస్టేషన్‌కు రేషన్ బియ్యం చేరాయి. ఈ బియ్యాన్ని లారీల ద్వారా రైల్వే స్టేషన్ నుంచి కడప నగరంలోని మార్కెట్‌యార్డు పక్కన ఉన్న గోడౌన్‌లకు తరలించారు. లారీల నుంచి బియ్యాన్ని దించే క్రమంలో కొన్ని బస్తాలు చినగడం, కొన్ని బస్తాలకు కుట్లు ఊడిపోవడంతో బియ్యం కింద పడిపోతున్నాయి. ఈ కింద పడ్డ బియ్యాన్ని ఆవు తింటుండగా 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది. ఇక్కడ కొసమెరుపు ఏమిటంటే ఈ బస్తాల్లో తక్కువ వచ్చిన బియ్యాన్ని డీలర్లకు అప్పచెబితే.. వారు కార్డు లబ్ధిదారులకు తక్కువ చేసి బియ్యాన్ని ఇస్తారనే ఆరోపణలు ఉన్నాయి. - కడప అగ్రికల్చర్

అక్కర లేని కయ్యం



చాపాడు మండలం మైదుకూరు - ప్రొద్దుటూరు జాతీయ రహదారిలో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలను సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చించివేశారు. అల్లాడుపల్లె సర్పంచ్ గోసుల కిషోర్‌కుమార్‌రెడ్డి ఆదివారం సాయంత్రం చాపాడులో, అల్లాడుపల్లె క్రాస్ వద్ద, నయారా పెట్రోల్ బంక్ సమీపంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి 11 గంటల వరకూ యథావిధిగా ఉన్న ఫ్లెక్సీలు మంగళవారం ఉదయం నాటికి చింపేసి ఉన్నాయని సర్పంచ్ కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. - చాపాడు

రారండోయ్.. జాతర చూద్దాం

- భక్తుల కల్పవల్లి ముత్తు మారెమ్మ
- ఈ నెల 10 నుంచి ఉత్సవాలు
- మత సామరస్యానికి ప్రతీకగా నిర్వహణ
- పెద్ద ఎత్తున తరలిరానున్న భక్తులు



అమ్మవారి మూలవిరాట్



ముత్తు మారెమ్మ ఆలయం

నందలూరు : భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ముత్తు మారెమ్మ ప్రసిద్ధి చెందారు. అమ్మవారు మండల కేంద్రంలోని అరవపల్లిలో కొలువై నిత్య పూజలు అందుకుంటున్నారు. హిందూ, ముస్లింలు ఐక్యతతో ఏటా నిర్వహించే అమ్మవారి జాతర మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. రాయలసీమ నలుమూలల నుంచే కాకుండా తమిళనాడు ప్రాంతాల నుంచి కూడా భక్తులు వస్తారు. వందేళ్ల క్రితం తమిళ కుటుంబానికి చెందిన అంకయ్య, వీరస్వామి మొదలియార్ ఈ ఆలయాన్ని ప్రారంభించారు. వారి మరణానంతరం వీరస్వామి మొదలియార్ కుమారుడు పొన్నుస్వామి మొదలియార్ ఆధ్వర్యంలో భక్తజనుల ఆదరణ చూరగొన్నారు. అంకయ్య మొదలియార్ జీవించి ఉండే కాలంలో హుబ్లీ నుంచి ముత్తు మారెమ్మ ఉత్సవ విగ్రహాన్ని తెచ్చి ఆలయంలో భక్తుల దర్శనార్థం ఉంచేవారు. ముత్తు అంటే ముత్యం.. అందువల్ల ఈ తల్లిని ముత్యాల మారెమ్మగా కూడా పిలుస్తుంటారు. తమిళ ఆడి (ఆగస్టు) మాస ప్రారంభానికి మూడు వారాల ముందు ఈ జాతరను నిర్ణయిస్తూ చాటింపు వేస్తారు. చాటింపుతో జాతర తంతు ఆరంభం అవుతుంది. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో తొలిరోజు అమ్మవారితోపాటు సోదరుడు పోతురాజు ఊరేగింపు మండల కేంద్రం ప్రధాన వీధులలో బాణసంచా పేలుళ్లు, భజన కార్యక్రమం, మేళతాళాల వాయిద్యాల మధ్య ఘనంగా నిర్వహిస్తారు. అమ్మవారికి ఏడుగురు సోదరీమణులు, ఒక సోదరుడు పోతురాజు ఉన్నారని.. పోతురాజు మినహా మిగతా ఏడుగురు సోదరీమణులు గ్రామ పొలిమేరలో గ్రామాన్ని రక్షిస్తూ ఉంటారని ఇక్కడి వారి విశ్వాసం. అమ్మవారి ఊరేగింపు సందర్భంగా ఎలాంటి క్షుద్రశక్తులు గ్రామంలోకి ప్రవేశించకుండా ఆసాది వారు నిమ్మకాయ మంత్రోచ్చారణతో చేసే కట్టడిని చూడటానికి చాలా ఆసక్తిగా ఉంటుంది. రెండోరోజు అమ్మవారి జాతర. ఆ రోజు మారెమ్మ సోదరుడు పోతురాజును ఊరేగింపుగా తీసుకెళ్తారు. గ్రామ పొలిమేరలో దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలో ఆల్విన్ అటవీ ప్రాంతం వద్ద.. ఊరికి కాపలా కాస్తున్న సోదరీ అన్నపూర్ణమ్మను జాతరకు తీసుకొచ్చి.. ఆమెకై ఆలయ ప్రాంగణంలో వేప మండలతో ప్రత్యేకంగా నిర్మించిన మందిరంలో ఉంచుతారు. ఈ రోజు ఏదైనా పీడ రోగాల నుంచి విముక్తి పొందిన వారు, విపత్తుల్లో అమ్మను శరణుజొచ్చి బయటపడిన వారు అంబలి పోసి కానుకలు, బలులు సమర్పిస్తారు. ఈ కార్యక్రమానికి అదే రోజు సాయంత్రం అమ్మవారి దర్శనానికి భక్తులు వేలాదిగా వస్తారు. మరికొందరు పందారపు బండ్ల ద్వారా మొక్కులు చెల్లిస్తారు. ఇక మూడవ రోజు పాలపూజ అమ్మవారిని శాంతింప చేసేందుకు పాలతో అభిషేకం చేస్తారు. భక్తులకు పొంగలిని ప్రసాదంగా పంచి పెడతారు. హిందూ, ముస్లింలు బాయిబాయి అంటూ అన్ని వర్గాల వారి సహాయ సహకారాలతో వైభవంగా నిర్వహించడం ఈ జాతర విశిష్టతగా చెప్పుకోవచ్చు. ఇక ప్రతి శుక్ర, ఆదివారాలలో పెద్ద సంఖ్యలో భక్తులు ముఖ్యంగా మహిళలు తమ సౌభాగ్యాన్ని పదిలంగా ఉంచుతారని అమ్మవారిని శరణు కోరుతారు. ప్రతి నిత్యం ఎంతో మంది వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు అమ్మవారి ఆలయాన్ని దర్శించిన తరువాత తమ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

10 నుంచి జాతర మహోత్సవాలు

జాతర మహోత్సవాలలో భాగంగా ఈ నెల 10న అమ్మవారి ఊరేగింపు, 11న జాతర, 12న పాలపూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు సేలం చంద్రశేఖర్ మొదలియార్ తెలిపారు.

ఆధిక్యంలో కడప జట్టు

నెల్లూరు బ్యాట్స్‌మన్ మన్విత్‌రెడ్డి 134 పరుగులు



మన్విత్‌రెడ్డి, నెల్లూరు (132 పరుగులు)



హర్షసాయిరెడ్డి, చిత్తూరు (102 పరుగులు)



యశ్వంత్, పశ్చిమ గోదావరి (5 వికెట్లు)

కడప స్పోర్ట్స్ : ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–19 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో కడప జట్టు స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతోంది. కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 6 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన నెల్లూరు జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 78.1 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 334 పరుగులు చేసింది. జట్టులోని మన్విత్‌రెడ్డి 175 బంతుల్లో 134 పరుగులు చేశాడు. ఈయనకు జతగా హమీద్ 66, కారుణ్య 64 పరుగులు చేశారు. కడప బౌలర్లు ధీరజ్‌కుమార్‌రెడ్డి 3 వికెట్లు తీశాడు. కాగా కడప జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 347 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో కడప జట్టు స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతోంది.

సెంచరీ సాధించిన హర్షసాయిరెడ్డి

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహిస్తున్న చిత్తూరు, పశ్చిమగోదావరి జట్ల మ్యాచ్‌లో 99 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన చిత్తూరు జట్టు 83 ఓవర్లలో 288 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్‌గా బరిలోకి దిగిన చిత్తూరు జట్టుకు చెందిన ఎం.హర్షసాయిరెడ్డి 14 ఫోర్లు, 1 సిక్సర్‌తో 102 పరుగులు చేశాడు. ఈయనకు జతగా లోహిత్‌లక్ష్మీనారాయణ 58 పరుగులు చేశాడు. పశ్చిమగోదావరి బౌలర్ యశ్వంత్ 5 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పశ్చిమగోదావరి జట్టు 24 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 76 పరుగులు చేసింది. జట్టులోని ప్రణీత్ పవన్ 34 పరుగులు చేశాడు. కాగా పశ్చిమ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 262 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో పశ్చిమ జట్టు 50 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

ఆధిక్యంలో కృష్ణా జట్టు

వైఎస్‌ఆర్‌ఆర్-ఏసీఏ మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 34 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన శ్రీకాకుళం జట్టు 43 ఓవర్లలో 137 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని సుశాంత్ 27, రోహిత్‌కుమార్ 23 పరుగులు చేశారు. కృష్ణా బౌలర్లు యశ్వంత్ 4, సాయిప్రకాష్ 2, గీత్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కృష్ణా జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 37 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 122 పరుగులు చేసింది. జట్టులోని ధనుష్ 56 పరుగులు చేశాడు. కాగా కృష్ణా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 219 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో కృష్ణా జట్టు 204 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

వరకట్న వేధింపుల కేసు నమోదు

మదనపల్లె : అదనపు వరకట్న వేధింపులపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. పట్టణంలోని రంగారెడ్డి కాలనీకి చెందిన పఠాన్ నజియా సుల్తానా (21)కి ఎస్‌వీఆర్ లేఅవుట్ మోతినగర్‌కు చెందిన నూర్ అహ్మద్‌తో గత ఏడాది వివాహమైంది. కొన్నాళ్లపాటు వీరి కాపురం సవ్యంగా సాగింది. కొన్నాళ్ల నుంచి నజియా సుల్తానాకు అత్తింటి నుంచి అదనపు వరకట్న వేధింపులు మొదలయ్యాయి. దీంతో వేధింపులు భరించలేక ఆమె రెండు నెలల క్రితం పుట్టింటికి చేరింది. సోమవారం రాత్రి తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మేరకు భర్త నూర్ అహ్మద్, అత్త జరీనా, మామ ఖాదర్ బాషా, ఆడపడుచులు నస్రిన్ తాజ్, మోసిన్ తాజ్, రోషిన్ తాజ్, అవ్వ జమ్రుత్ బీలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ రెండు సంవత్సరాల ఇంటర్మీడియట్ మరియు డైరెక్ట్ 10th Class APOSS ద్వారా కేవలం 1 సెటింగ్ లో ఉత్తీర్ణత. అలాగే నాగార్జున, ఆంధ్ర యూనివర్శిటీ ద్వారా B.A, B.Com, B.Sc, M.A, M.Com, MBA, MCA, MSC, కోర్సుల కంప్లీట్ ఫోన్: 9989095108

REAL ESTATE

■ తిరుపతి చుట్టుపక్కల మరియు పరిసర ప్రాంతాలలో మీ ప్రాపర్టీ (ప్లాట్స్/ఇల్లు) మంచి ధరకు కొనుగోలు చేస్తాము. వెంటనే సంప్రదించండి సెల్: 70138 93537.

SERIVCES

పాస్‌పోర్ట్ పోయినది

■ పాస్‌పోర్ట్ నంబర్ R5914671, కాసల రోషయ్య తండ్రి కాసల చిన్న రోషయ్య, నల్లకొండగారిపల్లె గ్రామం, అట్లూరు మండలం, YSR Kadapa District Pin- 516501 నల్లకొండగారిపల్లె నుండి బద్వేల్‌కు వెళ్తుతుండగా ఒరిజినల్ పాస్‌పోర్ట్ పోయినది. దొరికినవారు తెలుపగలరు. 6304783398

BUSINESS OFFER

■ మీరు బైబ్యాక్ అగ్రిమెంట్‌తో లాభదాయకమైన లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ వ్యాపారాన్ని ప్రారంభించండి. (ప్రభుత్వ ఆమోదితము) 8376001873, 9643010487, 83760 89771, 011-25920179

WANTED

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9948666206, 9573633520.

■ Wanted PET (Physical Education Teacher), A.O (Administration Officer) Sri Chaitanya High School. Cont : 9502485242, 7396879051

■ ప్రముఖ స్కూల్ నందు పనిచేయుటకు వార్డెన్స్ కావలెను. పురుషులు-2, స్త్రీలు-2 అర్హతను బట్టి మంచి వేతనము, వసతి కల్పించబడును. సంప్ర : 7569489905, 9966261571

■ కడప పట్టణంలో ప్రముఖ రెసిడెన్షియల్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు 3 to 5th ఇంగ్లీష్ (జీతం : 15K.) 3 to 5th E.V.S (జీతం : 15K.) 3 to 5th Hindi (Up to 15k), 8 to 10th బయాలజీ , (Up to 30k) 6 to 9th NEET ఫౌండేషన్ బయాలజీ (Up to 30k) బోధించుటకు అర్హత అనుభవం కలిగిన టీచర్లు కావలెను. Cont : 9059004684, 9292607689

■ ప్రముఖ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ నందు పనిచేయుటకు లీడర్స్ కావలెను. (ఏజంట్స్‌తో పని చేయించవలెను). అనుభవం : (1 to 3 సంవత్సరాలు) వ్యక్తులకు మొదటి ప్రాధాన్యత. సంప్ర : 8519824539

■ PAPARAO HIGH SCHOOL, K.UPPALA PADU, near Tangutur, Prakasam (Dt.) Wanted Hindi, Science, Social Teachers to Teach Primary (Ladies) & High School Classes (E.M). Salary Negotiable Free Boarding, Lodging Cont. ✆ 7019326579, 8008622210

■ ఖచ్చితంగా కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను జీ.15 వేలు-40 వేలు, ఫ్రీ రూమ్+భోజనం. HYD. Ph: 8317512135

■ ప్రభుత్వ సంస్థలో Outsourcing/ Contract పద్ధతిలో పనిచేయుటకు, కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్, ఒకేషనల్ టీచర్స్, జూనియర్ అసిస్టెంట్, కావలెను. 90590 54495.

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి 9705907418 9705944423 9010223797 9010072409

గమనిక

వివాహిత ఆత్మహత్య కేసులో నిందితుల అరెస్ట్

మదనపల్లె : వివాహిత ఆత్మహత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. పట్టణంలోని రామ్‌నగర్ కాలనీకి చెందిన వెంకటరమణ, లక్ష్మీదేవి దంపతుల కుమార్తె సాయి ప్రియాంక (24).. బాబు కాలనీకి చెందిన శ్రీనివాసులు, ఉష దంపతుల కుమారుడు మణికంఠ(25)తో ఫేస్ బుక్ ద్వారా పరిచయమై అది కాస్త ప్రేమగా మారింది. ఇరు కుటుంబాల పెద్దల అంగీకారంతో వీరి వివాహం జరిగింది. మణికంఠ మొదట చేనేత కార్మికుడిగా పని చేసే వాడు. కొంత కాలం క్రితం చేనేత పనులు మానేసి, ప్రస్తుతం టమాటా మార్కెట్లో పని చేస్తున్నాడు. మద్యానికి బానిసై కుటుంబాన్ని నిర్లక్ష్యం చేసి, భార్య సాయి ప్రియాంకను తరుచూ తల్లిదండ్రులతో కలిసి వేధించేవాడు. ఈ క్రమంలో భరించలేని సాయి ప్రియాంక జూలై 23వ తేదీ అర్ధరాత్రి ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై మృతురాలి తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితులైన భర్త మణికంఠ, అత్త ఉష, మామ శ్రీనివాసులను మంగళవారం బాబు కాలనీలో అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

సిద్ధవటం ఫారెస్ట్ కార్యాలయం పరిశీలన



కార్యాలయాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ నాగార్జునరెడ్డి

సిద్ధవటం : సిద్ధవటంలోని ఫారెస్ట్ రేంజ్ కార్యాలయాన్ని కడప డివిజనల్ సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌ఓ నాగార్జునరెడ్డి మంగళవారం సందర్శించారు. కార్యాలయం పచ్చని చెట్లు, రంగు రంగులతో ఎంతో ఆహ్లాదకరంగా ఉందని ఆయన కొనియాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పచ్చని చెట్లను పెంచడం వల్ల చల్లని గాలితోపాటు మంచి ఆరోగ్యాన్ని ఇస్తుందన్నారు. తాను కొండూరులోని నర్సరీని పరిశీలించేందుకు వెళ్తూ ఇక్కడికి రావడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రేంజర్ కళావతి పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న జేసీ

- రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ స్కూటరిస్టు
- తన కారులో ఆస్పత్రికి తీసుకెళ్లిన జాయింట్ కలెక్టర్



గాయపడిన వ్యక్తిని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మానవత్వాన్ని చాటుకున్నారు. మంగళవారం రాయచోటి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై పొత్తుకూరుపల్లెకు చెందిన స్కూటరిస్టు రమేష్ డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఆయన గాయపడ్డాడు. అదే సమయంలో జేసీ విధులు ముగించుకొని నివాసానికి వెళ్తున్నాడు. జరిగిన సంఘటనను చూసి వెంటనే అక్కడికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. వెంటనే 108కు ఫోన్ చేశాడు. సకాలంలో 108 రాకపోవడంతో తన వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలోని వైద్యులు వైద్య సేవలు అందించారు.

గిరి ప్రదక్షిణకు రోడ్డు మార్గం ఏర్పాటు



రోడ్డు మార్గాన్ని పరిశీలిస్తున్న సీఐ పురుషోత్తం రాజు

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలో గిరిప్రదక్షిణకు కావాల్సిన రోడ్డు మార్గాన్ని సీఐ పురుషోత్తం రాజు ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మార్గానికి ఆటంకాలుగా ఉన్న చెట్లు, ముళ్లపొదలను జేసీబీలు, డోజర్లతో తొలగిస్తూ అనువుగా తయారు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రెండు పౌర్ణమిల నుంచి గిరిప్రదక్షిణ మొదలు పెట్టామని, రానున్న ఆగస్టు 19వ తేదీన శుక్లపక్షం పౌర్ణమి నాడు శ్రీరామ భక్తులందరూ గిరిప్రదక్షిణలో పాల్గొనాలని ఆయన కోరారు.

బాలిక అదృశ్యం

బి.కొత్తకోట : చిత్తూరు జిల్లా కల్లూరుకు చెందిన బాలిక అదృశ్యంపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. 15 ఏళ్ల బాలిక జూలై 3న అదృశ్యమైనట్లు తండ్రి బాల కల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడ కేసు నమోదయింది. అయితే అదృశ్యమైన బాలిక బి.కొత్తకోటలోని పిటిఎం రోడ్డులో కనిపించినట్లు సమాచారం రావడంతో.. కేసును అక్కడి నుంచి స్థానిక పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. దీనిపై ఏఎస్‌ఐ బొజ్జి నాయక్ మళ్లీ ఇక్కడ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇక్కడ కేసు నమోదు అయిన విషయాన్ని కల్లూరు పోలీసులకు సమాచారం అందించారు.

తేనెటీగల దాడిలో నలుగురికి గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రమాదేవి

మదనపల్లె : తేనెటీగల దాడిలో నలుగురు వ్యక్తులు గాయపడిన సంఘటన మంగళవారం పట్టణంలో జరిగింది. త్యాగరాయ వీధిలోని కృష్ణా స్కూల్ సమీపంలో ఓ ఇంటి గోడకు ఏర్పడిన తేనె తుట్టె నుంచి తేనెటీగలు గుంపుగా వచ్చి, ఆ దారిలో వెళుతున్న పాదచారులపై దాడి చేశాయి. ఈ ఘటనలో చంద్రశేఖర్ (52), రమాదేవి (45) రెడ్డి మహమ్మద్ (40), ఖాదర్ వలీ (42)లకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితులను స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్సల అనంతరం వారు కోలుకున్నారు.

కారు, బైక్ ఢీకొని..

సుండుపల్లె : రాయచోటి-సుండుపల్లె ప్రధాన రహదారిలోని రాచంవాండ్లపల్లె సమీపంలో ఆదివారం ద్విచక్ర వాహనం, కారు ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారునికి గాయాలయ్యాయి. బాధితుడిని 108 వాహనం ద్వారా రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఎస్‌ఐ ఎస్‌కేఎం హుస్సేన్ మంగళవారం తెలిపిన మేరకు వివరాల ఇలా ఉన్నాయి. రాయచోటికి చెందిన రెడ్డిశేఖర్ నాయుడు సుండుపల్లెలోని గాండ్లపల్లె సమీపంలోని గురుకుల పాఠశాలలో చదువుతున్న తన కుమారున్ని చూసేందుకు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నూతన నియామకం

కడప ఎడ్యుకేషన్ : నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ(ఏఐఎఫ్‌బీ) రాయలసీమ జిల్లాల కన్వీనర్‌గా జాల జయవర్ధన్‌ను నియమించారు. ఈ నెల నాలుగో తేదీ కడప నగరంలోని ఐఎంఏ హాల్‌లో జరిగిన పార్టీ రాష్ట్ర కన్వెన్షన్ మీటింగ్‌లో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి దేవరాజన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీ సుందర రామరాజులు రాయలసీమ జిల్లాల బాధ్యతను జయవర్ధన్‌కు అప్పజెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ 1939లో అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ స్థాపించారని తెలిపారు.

ప్రజా పోరాట యోధుడు గద్దర్

ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

మదనపల్లె : ప్రజా పోరాట సాంస్కృతిక యోధుడు గద్దర్ ప్రజల్ని మహాశక్తివంతులుగా మార్చడానికి తీసుకున్న ఏకైక ఆయుధం పాటేనని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య కొనియాడారు. మంగళవారం మదనపల్లి రామారావు కాలనీలోని ఏఐటీయూసీ కార్యాలయంలో గద్దర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ పీడిత వర్గాల గొంతుకగా నిలిచి, పాటనే అస్త్రంగా చేసుకుని ప్రజా ఉద్యమాలలో సాంస్కృతిక విప్లవాన్ని సృష్టించిన ప్రజా యుద్ధ నౌక గద్దర్ అని అన్నారు. గద్దర్ సాహిత్యం, జీవితంను వేరు వేరుగా చూడలేమన్నారు. సమాజంలో భావ విప్లవం, సాంస్కృతిక విప్లవం రెండూ నిరంతరం కొనసాగాలని సూచించారు. కేవలం సాయుధ విప్లవం ఒంటరిగా విజయవంతం కాదని గద్దర్ అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి కూడా గద్దర్ పాటే ప్రాణం పోసిందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం గద్దర్ పేరు మీద స్మారక అవార్డులు ఇవ్వాలని తీర్మానం చేసినట్టు గానే.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఏటా గద్దర్ జయంతి రోజున గద్దర్ స్మారక అవార్డులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.కృష్ణప్ప, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి తిరుపతి జిల్లా కార్యదర్శి జింకా నాగరాజు, అన్నమయ్య జిల్లా ఏఐటీయూసీ మదనపల్లి నియోజకవర్గ సహాయ కార్యదర్శి ముబారక్, మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరుమలప్ప, దేవేంద్ర, నాగేశ్వరి, రమణమ్మ, రఘు తదితరులు పాల్గొన్నారు.

పీలేరు గ్రామ పంచాయతీలో రూ. 1.40 కోట్ల అవినీతి

ముగ్గురు ఈవోలు, ఇద్దరు సర్పంచ్‌లకు షోకాజ్ నోటీసులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి, ఈవో గురుమోహన్

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీలో రూ.1,40,43,714 అవినీతి జరిగినట్లు ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి, ఈవో గురుమోహన్ తెలిపారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామ పంచాయతీలో భారీగా అవినీతి జరిగినట్లు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మదనపల్లె డీఎల్‌పీవో నాగరాజు నేతృత్వంలో గత నెల 5వ తేదీ నుంచి 22 రోజుల పాటు రికార్డులను పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక అందజేశారన్నారు. 2021 ఏప్రిల్ 1 నుంచి 2024 జనవరి 17 వరకు హబీబ్‌బాషా సర్పంచ్‌గా పని చేశారన్నారు. ఆయన హయాంలో రూ. 80,74,184 అవినీతి జరిగినట్లు తెలిపారు. అనంతరం 2024 జనవరి 18 నుంచి 2024 జూన్ 15 వరకు ఇన్‌చార్జి సర్పంచ్ జీనత్‌షఫీ హయాంలో రూ.59,64,430 అవినీతి జరిగినట్లు చెప్పారు. ఇద్దరు సర్పంచ్‌లతో పాటు ఈవోలు రెడ్డిప్రసాద్‌రెడ్డి, వరప్రసాద్, గఫూర్‌లకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. 15 రోజుల లోపు సంజాయిషీ ఇవ్వాల్సి ఉందన్నారు.

• ఒంటెలు స్వాధీనం



సంబేపల్లె మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె పంచాయతీలో 16 ఒంటెలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ మంగళవారం తెలిపారు. తమకు అందిన సమచారం మేరకు సిబ్బందితో అక్కడికి వెళ్లి వాటిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీనిపై విచారణ చేస్తున్నామని వివరించారు. - సంబేపల్లె